క్లుప్తంగా

మున్సిపల్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం

ఆత్మకూరురూరల్: మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని ఇరిగేషన్ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలకు జననధ్రువీకరణ పత్రంతో ఆధార్ నమోదు చేయించుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్ నంబర్లు, బయోమెట్రిక్ అప్‌డేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

ఉదయగిరి: ప్రభుత్వం మైనార్టీల స్వయం ఉపాధి కోసం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తోందని ఎంపీడీఓ అప్పాజీ సోమవారం తెలిపారు. 21 నుంచి 55 ఏళ్లలోపు కలిగిన ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్శీలు అర్హులని చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీ లోగా ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఉదయగిరి: పట్టణం సమీపంలోని గండిపాళెం మార్గంలో 167బీజీ జాతీయ రహదారి సర్కిల్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన పీ మౌలాలి మోటార్‌సైకిల్‌పై ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో గండిపాళెం మార్గంలోని జాతీయ రహదారి సర్కిల్ సమీపంలోకి రాగానే మౌలాలి బైక్‌ను కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో మౌలాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

సోమశిల: అనంతసాగరం మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామచంద్రయ్య సోమవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా - ముగ్గురికి గాయాలు



సీతారామపురం : మండల పరిధిలోని సీతారామపురం-పోరుమామిళ్ల ఘాట్‌రోడ్డులో ఎరువు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ సోమవారం బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. సీతారామపురం మండలం నుంచి వైఎస్సార్ జిల్లా టేకూరుపేట ప్రాంతానికి ఎరువు లోడుతో బయలుదేరిన ట్రాక్టర్ ఘాట్‌రోడ్డుపై ట్రాలీ రిమ్ము విరగడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బంది వారి యంత్రాల సహాయంతో బోల్తా పడిన ట్రాక్టర్‌ను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ఏరియా వైద్యశాలలో మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువుల ఆందోళన

కావలి(జలదంకి): కావలి ఏరియా వైద్యశాలలో మద్దూరుపాడుకు చెందిన రావినూతల సునీత (34) అనే మహిళ సోమవారం మృతి చెందింది. చిన్నపాటి ఆపరేషన్ చేయించుకునేందుకు సునీత సోమవారం ఏరియా వైద్యశాలకు వచ్చింది. వైద్యులు ఆపరేషన్ చేసిన గంట సమయానికి ఆమె స్పృహ కోల్పోయింది. వైద్యులు వచ్చి పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే సునీత మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 400 బేళ్లను తీసుకురాగా, 314 బేళ్లను కొనుగోలు చేశారు.వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ. 200, సరాసరిన రూ. 248.64 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

డీసీపల్లిలో 414 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 414 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 624 బేళ్లు రాగా, 414 బేళ్లను కొనుగోలు చేశారని చెప్పారు. వేలంలో కిలో పొగకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సగటున రూ.249.97 ధర పలికిందని వివరించారు.

అత్యవసరమైతే నరకమే

- ప్రభుత్వ కార్యాలయాలు.. బస్టాండ్ సెంటర్లలో..
- మరుగుదొడ్లు లేక ప్రజల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ఉదయగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు స్వచ్ఛభారత్ పేరిట పరిసరాల శుభ్రతకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరుతున్నట్లుగా కనిపించడంలేదు. స్వచ్ఛభారత్ పేరిట గ్రామాల్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఉపదేశించే అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో అవి లేకున్నా పట్టించుకోవడం లేదు. మండల కేంద్రాల్లోని తహసీల్దార్, ఎంపీడీఓ, వెలుగు, పోలీస్‌స్టేషన్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. వారు వచ్చిన సమయానికి చాలా మంది అధికారులు అందుబాటులో ఉండరు. దీంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ సమయంలో అత్యవసరంగా మల,మూత్ర విసర్జనలకు వెళ్లాల్సి వస్తే మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురుషులు ఆరుబయటకు వెళ్లినా, మహిళలు ఎంతో నరకాన్ని చవిచూస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు సైతం ఆరుబయటకు పరుగులు తీయాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా మహిళ ఉద్యోగులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అత్యవసరమైతే ఎక్కడకి వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయగిరి నియోజవర్గ కేంద్రమైన ఉదయగిరిలో తహసీల్దార్, ట్రెజరీ, సబ్‌రిజిస్ట్రార్, పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం అధిక సంఖ్యలో కార్యార్థులు ఇక్కడికి వస్తుంటారు. అత్యవసరమైతే ఏ కార్యాలయంలో కూడా మరుగుదొడ్లు లేవు. పురుషులు అయితే ఎలాగోలా తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. కానీ మహిళలు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటోంది. అలాగే నియోజకవర్గంలో అధిక జనాభా కలిగిన వింజమూరు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి. వరికుంటపాడు, దుత్తలూరు, జలదంకి, కొండాపురం, సీతారామపురం, కలిగిరి మండల కేంద్రాల్లోని అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల అవసరాలను తీర్చే మరుగుదొడ్లు అందుబాటులో లేవు.



మరుగుదొడ్లు లేని దుత్తలూరు బస్టాండ్ సెంటర్



మరుగుదొడ్లు లేని వింజమూరు ఎంపీడీఓ కార్యాలయం

బస్టాండ్ సెంటర్లలోనూ..

మండల కేంద్రమైన దుత్తలూరు కూడలిలో ప్రతిరోజూ వేకువజామున బెంగుళూరు, హైదరాబాదు నుంచి వచ్చే బస్సుల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులు దిగుతుంటారు. ఈ సమయంలో ఖచ్చితంగా మల,మూత్ర విసర్జనలు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ప్రధానంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పంచాయతీ అధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని ఏళ్ల తరబడి ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి బస్టాండ్ సెంటర్లలోనూ ఇదే పరిస్థితి ఉంది.

మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి



మండల తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. అధికారులు కోసం చాలాసేపు వేచి ఉంటారు. ఈ క్రమంలో అత్యవసరంగా మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తే ఇక్కడ లేవు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే మరుగుదొడ్లు సౌకర్యం కల్పించాలి.

–మల్లికార్జున, జనార్దనపురం

సమస్యను పరిష్కరిస్తాం



ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో అనేక కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ పబ్లిక్‌కు సంబంధించి మరుగుదొడ్లు లేని మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– సుభద్ర, తహసీల్దార్, ఉదయగిరి

పేకాటస్థావరాలపై దాడులు

కొండాపురం/కలిగిరి: కొండాపురం మండలం గానుగపెంట పంచాయతీ పరిధిలోని ఆదిమూర్తిపురం పంట పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కొండాపురం ఇన్‌చార్జి ఎస్సై ఉమాశంకర్ తన సిబ్బందితో సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద రూ.2,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే కలిగిరి: మండలం తూర్పుదూబగుంట-కొమ్మి గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు కలిగిరి ఎస్సై ఉమాశంకర్ సోమవారం తెలిపారు. జూదరుల నుంచి రూ.42,180 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. గ్రామాల్లో పేకాట, కోడి పందేలు వంటి జూదాలు నిర్వహిస్తున్నా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 94407 00098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం

- ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో జలదంకి మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. వ్యక్తిగత కక్ష తీర్చుకోవడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరన్నారు. అధికారం చేతిలో ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్న కూటమి పాలకులు అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. వ్యక్తిగత కక్షలను పక్కన పెట్టి ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త తన శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డిని నాయకులు శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, పబ్లిక్ వింగ్ మండలాధ్యక్షుడు సురె వెంకటశేషారెడ్డి, నాయకులు వంటేరు లక్ష్మీనరసారెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి, కోర్సిపాటి రామిరెడ్డి, దేవరపల్లి రఘురామిరెడ్డి, దేవరపల్లి మధుసూదన్‌రెడ్డి, పులి బాబుల్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, చైతన్యరెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు డివిజన్‌లో ఓ మోస్తరు వర్షం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డివిజన్ పరిధిలో సోమవారం వేకువజాము నుంచి ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆత్మకూరు లో 40.6, ఉదయగిరిలో 6.0, సీతారామపురంలో 5.4, మర్రిపాడులో 6.6, అనుమసముద్రంపేటలో 30.6, సంగంలో 34.2, చేజర్లలో 35.2, అనంతసాగరంలో 21.4, కలువాయిలో 18.2 మి.మీ.చొప్పున వర్షపాతం నమోదైనట్లు ఆత్మకూరు డివిజనల్ గణాంకాధికారి సురేష్ తెలిపారు.

కొండాపురంలో 40.2 మి.మీ వర్షపాతం

కొండాపురం: మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. కొమ్మి, రామానుజపురం, సత్యవోలు, అగ్రహారం, పార్లపల్లి, తదితర గ్రామాల్లో వర్షం పడింది. మండలంలో 40.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.కాగా నెల రోజులు గా ఎండలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతు న్నారు. ఈ తరుణంలో వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం పొందారు.

పుచ్చలపల్లి సేవలు చిరస్మరణీయం



ఉదయగిరిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో..

ఆత్మకూరురూరల్: దక్షిణ భారత కమ్యూనిస్ట్ పార్టీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పార్టీకి, ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలు, సేవలను స్మరించుకున్నారు. మండల శాఖ నాయకులు ఆండ్రా శ్రీనివాసులురెడ్డి, ముదిరెడ్డి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి చిత్రపటానికి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నాయకులు డేవిడ్‌రాజు, శివయ్య, నాగయ్య, సందానీ, శ్రీహరి, హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ సుందరయ్య ఉద్యమాలకు వేగుచుక్కగా పేరొందారన్నారు. 1936లో కూలీ సంరక్షణ సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. నాయకులు ఫరిద్దీన్‌బాషా, జీ నాగేశ్వరరావు, కే రమణయ్య, పీ వెంకటేశ్వర్లు, నాయబ్, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: బ్రాహ్మణక్రాక, జలదంకిలోని సీపీఎం కార్యాలయాల్లో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఎం నాయకుడు టీ మాల్యాద్రి మాట్లాడుతూ సుందరయ్య పేద ప్రజల కోసం నిత్యం పరితపించేవాడన్నారు. సీపీఎం నాయకులు గడ్డం మాల్యాద్రిరెడ్డి, రావి మాల్యాద్రి, ఆంతోనీబాబు, దేవరకొండ బాలయ్య, చింతం వెంకటేశ్వరరెడ్డి, విజయలక్ష్మి, రత్నమ్మ, బత్తల నరసింహ, మాధవ, గోసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరంలోని బస్టాండ్ సెంటర్‌లో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, వేము పెంచలయ్య, మండల కార్యదర్శి అన్వర్‌బాషా, గాడి సుధాకర్, జకరయ్య, వెంకటేష్, మీరా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దగదర్తి : మండలంలోని దామవరం ఎస్సీ కాలనీ, నారాయణపురం, అనంతవరం, అల్లూరురోడ్డు, తదితర గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఎం నాయకులు గోపసాని రమేష్ , వంటేరు సుధాకర్, పెరికిల మాల్యాద్రి,గురజాల వెంకటేశ్వర్లు,మంద మహేష్, చల్లా మాల్యాద్రి, గొల్లపల్లి రామయ్య పాల్గొన్నారు.



దగదర్తి మండలంలో..



జలదంకిలో..

కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించాలి

ఉదయగిరి: బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా అందిస్తున్న కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని కుట్టులో నైపుణ్యం సాధించి ఆర్థిక పరిపుష్టి సాధించాలని బీసీ కార్పొరేషన్ జిల్లా కో-ఆర్డినేటర్లు ఎస్ పద్మా, సుమతి అన్నారు. ఉదయగిరిలోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం వారు సందర్శించారు. కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి సూచనలు చేశారు. జిల్లాలోకెల్లా ఉదయగిరి కేంద్రంలో అత్యధికంగా మహిళలు శిక్షణకు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. 80శాతం హాజరుతో శిక్షణను పూర్తిచేసుకున్న మహిళలకు కుట్టుమెషిన్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకురాలు నాజీయాతాజూన్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్లు

కానిస్టేబుల్‌కు సన్మానం



ఉదయగిరి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ నెల్లూరు మూడో పట్టణ స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న పామూరు సుబ్బయ్యను పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు కే ఇంద్రసేనారెడ్డి, ఏ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో సుబ్బయ్యను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. అనంతరం ఆయనకు మిఠాయిలు తినిపించి సన్మానించారు.

ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీలు

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణను ఫ్లయింగ్ స్క్వాడ్, సీఎంఓ పెంచలయ్య సోమవారం తనిఖీ చేశారు. పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను సందర్శించి పాఠ్యపుస్తకాలు, బెల్టులను పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పుస్తకాలను చేర్చాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ-2 తోట.శ్రీనివాసులు ఉన్నారు.



విద్యాసామగ్రిని పరిశీలిస్తున్న సీఎంఓ పెంచలయ్య

కావలిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

కావలి(జలదంకి): కావలి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని దొడ్ల మనోహర్‌రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన మినీమహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేశారు.

ఉదయగిరి అభివృద్ధికి కృషి

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వింజమూరులో సోమవారం నిర్వహించిన మినీమహానాడులో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పరిశీలకులు వికాస్ హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పాల్గొన్నారు. కాగా మినీమహానాడుకు మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డి హాజరుకాకపోవడం విశేషం.

జయహో తిరంగా



కావలిలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కావలి(జలదంకి): ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా కావలి పట్టణంలో తిరంగా యాత్రను సోమవారం రాత్రి నిర్వహించారు. పట్టణంలోని గుర్రం పెట్రోల్ బంకు వద్ద నుంచి ఐలవ్ కావలి ఐకాన్ సెంటర్ వరకు తిరంగా యాత్ర కొనసాగింది. పట్టణానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జయహో భారత్, భారత్‌మాతాకి జై నినాదాలతో హోరెత్తించారు. కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి యువతరం దేశభక్తిని అలవరుచుకోవాలన్నారు. కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీదేవి, మాజీ సైనికులు, ప్రజలు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర జయప్రదానికి పిలుపు

ఆత్మకూరురూరల్: హనుమజ్జయంతి సందర్భంగా ఈ నెల 25న ఆత్మకూరులో నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని హనుమాన్ భక్త కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆత్మకూరులోని అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. పురవీధుల గుండా యాత్ర సాగుతుందన్నారు. హనుమాన్ భక్తులు పాల్గొనాలని కోరారు.

పోలీసుల రక్షణ కోరిన ప్రేమజంట

ఉదయగిరి: సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయ్యారు. అది కాస్త ప్రేమగా మారడంతో ఇద్దరు ఒక్కటవ్వాలనుకున్నారు. ఇంట్లో పెద్దలకు చెప్పారు. కానీ వారు ఒప్పుకోకపోవడంతో దుత్తలూరు మండలం వెంగమాంబ సన్నిధిలో వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. ఆ తరువాత పెద్దల నుంచి ప్రాణహాని ఉందంటూ ఉదయగిరి పోలీసుల రక్షణ కోరారు. ఈ ఘటన సోమవారం జరిగింది. వివరాలు..ఉదయగిరి మండలం సంజరాజుపల్లికి చెందిన ఓంకారం వెంకటసుబ్బయ్య కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చేస్తున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన అడుసుమల్లి చంద్రుష గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులోని మలినేని లక్ష్మయ్య కళాశాలలో బీటెక్ చేస్తున్నారు. ఇరువురి నడుమ సోషల్ మీడియా ద్వారా ఏర్పడిన పరిచయం కాస్తా పెరిగి ప్రేమగా మారి పెండ్లికి దారి తీసింది. కాగా ఈ నెల 16వ తేదీ నుంచి తమ కుమార్తె కనిపించడం లేదంటూ అమ్మాయి తల్లిదండ్రులు గుంటూరులోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కే ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

ఉదయగిరి రూరల్: సీఆర్‌ఎంటీలు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పాఠశాలల ఆవాస ప్రాంతాల పరిధిలోని బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో నమోదు చేయాలన్నారు. అనంతరం మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్, విద్యార్థుల నమోదు ప్రత్యేక కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ, తదితర అంశాలపై చర్చించారు.

తిమ్మారెడ్డిపల్లిలో మాతమ్మ చిందులు

వరికుంటపాడు: మండలం తిమ్మారెడ్డిపల్లిలో నాగార్పమ్మ కొలుపును శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించారు. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగలదిన్నె గ్రామానికి చెందిన బొట్ల కుటుంబీకులకు తిమ్మారెడ్డిపల్లిలోని నాగార్పమ్మ కులదేవత. నాగార్పమ్మ కొలుపు సందర్భంగా మాతమ్మ చిందులు వేయించి నిషేధంలో ఉన్న ఆచారాన్ని ప్రేరేపించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వారం రోజుల క్రితం తోటలచెరువుపల్లిలో జరిగిన కొలుపులో కూడా మాతమ్మ చిందులు వేయించారనే ప్రచారం జరుగుతోంది. అదే విధంగా మండలంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పేరుతో ముందస్తు అనుమతులు లేకుండా అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తున్నా పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. చెబుతున్నారు.